క్లుప్తంగా

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ



తాళ్లపూడిలో కుట్టు మిషన్‌పై శిక్షణ పొందుతున్న మహిళలు

తాళ్లపూడి: మండల కేంద్రం తాళ్లపూడిలో మహిళలకు స్వయం ఉపాధి కలిగే విధంగా తాళ్లపూడిలో బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా (టైలరింగ్)పై శిక్షణ ఇస్తున్నారు. సుమారు 50 మంది మహిళలు టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. 90 రోజుల శిక్షణతో పాటు సర్టిఫికెట్, ఒక కుట్టు మిషన్ అందించనున్నారు. శిక్షణారాలు మోహన దుర్గ మాట్లాడుతూ 40 రోజులుగా శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. మరో పది రోజుల్లో శిక్షణ పూర్తవుతుందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీసీ కార్పొరేషన్ ద్వారా సర్టిఫికెట్, మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తామని పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నల్లజర్ల: విజయవాడలోని ప్రముఖ ఎముకల డాక్టర్ యం.జే.నాయడు బృందం ఆధ్వర్యంలో బుధవారం నల్లజర్లలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. స్థానిక అల్లాడ రామయ్య కళ్యాణమండపంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుంది. ఈ వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్లు, మోకాళ్లు, మెడ, నడుమ నొప్పి, కండరాలు, పాదాల నొప్పులు, నరాలు, అరికాళ్ల తిమ్మెర్లు, మంటలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవలు, ఇతర ఇన్సూరెన్స్‌ల ద్వారా చేస్తామన్నారు. నల్లజర్ల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం

నిడదవోలు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసనాయుడు హాజరవుతారని తెలిపారు. తిమ్మరాజుపాలెం గ్రామంలో కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉన్న తిరుచానూరు పద్మావతి కల్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కార్యాచరణపై చర్చిస్తారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ, పార్టీ అనుబంధ విభాగాల కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ వాహనం వేలం

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ శాఖకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న ఓ జీపును బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆగస్టు 12వ తేదీ ఉదయం 11.గంటలకు ఆర్టీఏ కార్యాలయం రాజమహేంద్రవరంలో వేలం నిర్వహిస్తున్నట్టు వివరించారు. 30వ తేది నుంచి వచ్చే నెల 10వ తేది వరకు కొవ్వూరులోని తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ నిమిత్తం వాహనాన్ని అందుబాటులో ఉంచుతామని బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఫోటో ఐడీ, చిరునామ తీసుకుని రావాలని వెల్లడించారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు.

పశ్చిమడెల్టాకు సాగునీటి విడుదల

నిడదవోలు: రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను క్రమబద్ధీకరించారు. విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి మంగళవారం 6,000 వేల క్యూసెక్కుల గోదావరి జలాలను సాగునీటి కాలువలకు విడుదల చేశారు. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 13.99 మీటర్లు నమోదయ్యింది. పశ్చిమడెల్టా పరిధిలో నరసాపురం కాలువకు 2,130 క్యూసెక్కులు, తణుకు కాలువకు 827 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1,180 క్యూసెక్కులు, ఉండి కాలువకు 992 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 381 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

మహిళల సేవలు అభినందనీయం



మహిళా బృందాన్ని అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: తిరుమలలో పర్యటిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను బుధవారం తిరుమల భక్తులకు సేవలందిస్తున్న నిడదవోలుకు చెందిన మహిళా బృంద సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలో తోటి యాత్రికులకు నిస్వార్థంగా ఉచిత సేవను అందిస్తూ ఆధ్యాత్మిక భావంలో మునిగితేలుతున్న నిడదవోలుకు చెందిన మహిళల బృందాన్ని మంత్రి అభినందించారు.

డ్రాగన్ ధర ధమాల్

- గిట్టుబాటు కాని పండ్ల సాగు
- పెట్టుబడి ఎక్కువ ఆదాయం తక్కువ
- ఎకరాకు రూ.8 లక్షల ఖర్చు
- జిల్లాలో 46 ఎకరాల విస్తీర్ణంలో సాగు



యాదవోలు గ్రామంలో డ్రాగాన్ సాగు

దేవరపల్లి: సంప్రదాయ పంటలతో పాటు ఆధునిక పంటల సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. కరోనా అనంతరం డ్రైఫ్రూట్స్‌తో పాటు డ్రాగన్ ఫ్రూట్స్‌కు మార్కెట్లో డిమాండ్ ఏర్పడడంతో రైతులు పంట సాగుకు మొగ్గు చూపారు. రైతులకు లాభాలు, ప్రజలకు ఆరోగ్యాన్ని తెచ్చిపెట్టే పంటగా మంచి గుర్తింపు పొందింది. కాని ప్రస్తుతం పంట సాగుకు రైతులు వెనకడుగు వెస్తున్నారు. మార్కెట్లో గిట్టుబాటు కాక రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారు. కొవ్వూరు డివిజన్‌లోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, తాళ్లపూడి, చాగల్లు, పెరవలి, మండలాల్లోని పలు పలువురు రైతులు తక్కువ విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టారు. పండ్ల తోటల పెంపకానికి జాతీయ ఉపాధి హామీ పథకంలో రాయితీ ఇచ్చి రైతులను ప్రోత్సహించారు. పంట వేసిన రైతులు గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి ఎక్కువ, ఆదాయం తక్కువగా ఉందని వాపోతున్నారు. రైతు వద్ద కిలో 60 నుంచి 80 పలుకుతుండగా, మార్కెట్లో రూ.150 నుంచి 160 వరకు ఎక్కువ ధర పలుకుతున్నట్టు తెలిపారు.

ఎకరాకు రూ.8 లక్షల ఖర్చు

మొక్క పెట్టిన ఏడాది ఎకరాకు రూ.8 లక్షలు ఖర్చు అవుతుంది. సిమెంట్ స్తంభాలు, ప్లేట్లకు ఖర్చు ఎక్కువ అవుతుంది. మొదటి రెండేళ్లు దిగుబడి అంతంత మాత్రంగా ఉంటుంది. మూడో ఏట నుంచి దిగుబడి బాగుంటుంది. మొదటి రెండేళ్లు ఎకరాకు 4 టన్నుల దిగుబడి వస్తోంది. పదో సంవత్సరం నుంచి ఎకరాకు 10 టన్నుల దిగుబడి వస్తోందని అధికారులు చెపుతున్నారు. సీజన్‌లో టన్ను ధర రూ 80 వేల నుంచి లక్ష వరకు ఉంటుంది. జూన్ నుంచి అక్టోబర్ వరకు సీజన్ ఉంటుంది. నాలుగు దశల్లో పంట దిగుబడి వస్తోంది.

46 ఎకరాల్లో సాగు

జిల్లాలో 46 ఎకరాల విస్తీర్ణంలో డ్రాగాన్ ఫ్రూట్ పంట సాగు చేస్తున్నారు. పంట దిగుబడులు తగ్గడం, చీడపీడలు ఎక్కువ వ్యాపించడంతో ఉత్పత్తి తగ్గినట్టు రైతులు తెలిపారు. ఈ ఏడాది అధికవర్షాలకు పంటకు వైరస్ సోకి కాయలు కుళ్లిపోయినట్టు రైతులు వివరించారు.

మండలాల వారీగా సాగు వివరాలు ఎకరాల్లో	
మండలం	విస్తీర్ణం ఎకరాలు
దేవరపల్లి	2.22
నల్లజర్ల	1.60
గోపాలపురం	4.00
తాళ్లపూడి	3.00
చాగల్లు	2.50
పెరవలి	1.00
కొవ్వూరు	2.95

డ్రాగన్ ఫ్రూట్ అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది. ఇది క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షిస్తుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అనేక రకాల విటమిన్లు, కాల్షియం, ఐరన్, మెగ్నిషియం, ఫైబర్ తదితర మేలు చేసే గుణాలు ఉంటాయని చెబుతున్నారు. ఒక డ్రాగన్ ఫ్రూట్ దాదాపు 100 కేలరీల శక్తిని అందిస్తుందని, కొవ్వును కలిగి ఉండదని, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని, ఇది రక్తంలో చక్కర స్థాయిని తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. మార్కెట్లో ధర అందుబాటులో లేకపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. కిలోకు సైజును బట్టి నాలుగు నుంచి ఐదు పండ్లు వస్తున్నాయి.



మార్కెట్లో విక్రయిస్తున ఫ్రూట్స్

అమెరికన్ బ్యూటీ ఫ్రూట్స్ సాగు

డ్రాగాన్ ఫ్రూట్స్‌లో దాదాపు 150 రకాలు ఉండగా, ఎక్కువగా అమెరికన్ బ్యూటీ రకం సాగు చేస్తున్నారు. అమెరికన్ ఫ్రూట్ గులాభి రంగులో ఉండి రుచికరంగా ఉంటుందని, దీనితో వినియోగదారులు ఈ రకం ఫ్రూట్స్ కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారని రైతులు తెలిపారు. ప్రస్తుతం పంట సీజన్ ప్రారంభమైయిందని వివరించారు.

పెట్టుబడి ఎక్కువ



1.50 ఎకరాల్లో పంట వేశాను. పంట వేసి మూడేళ్లు అయింది. ప్రతి ఏటా ఎకరాకు రూ.2 నుంచి రూ.3 లక్షల పెట్టుబడి అవుతుంది. ఈ ఏడాది అధిక వర్షాలకు కాయ కుళ్లిపోయి మచ్చలు వచ్చాయి. మార్కెట్ సదుపాయం లేదు.

–కోలా రవికిరణ్, రైతు, యాదవోలు, దేవరపల్లి మండలం

సాగు విస్తీర్ణణానికి కృషి చేస్తున్నాం



పంట గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ఆసక్తి చూపడంలేదు. ఐడీహెచ్ పథకంలో హెక్టారుకు 2.70 లక్షల రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. పండ్లకు మార్కెట్లో డిమాండ్ ఉంది. ప్రజల్లో పండ్ల వినియోగం పెరుగుతుంది. సాగు విస్తీర్ణం పెంచడానికి కృషి చేస్తున్నాం.

–ఎస్.మల్లిఖార్జునరావు, జిల్లా ఉద్యానవన అధికారి, రాజమహేంద్రవరం

ప్లాస్టిక్ వాడకంపై జరిమానాలు

తాళ్లపూడి: మండలంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో 120 మైక్రాన్లలోపు ఉన్న ప్లాస్టిక్ సింగిల్‌యూజ్ వస్తువులు కవర్లు, డిస్పోజబుల్ గ్లాస్‌లు, కప్పులు, స్పూన్‌లు, క్యారీ బ్యాగ్‌లు విక్రయిస్తున్న పలువురు వ్యాపారస్థులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా తాళ్లపూడి పంచాయతీ ఆధ్వర్యంలో బజార్ సెంటర్‌లో ఇప్పటి వరకు 150 మందికీ నోటీసులు జారీ చేసినట్లు ఇవో పీఆర్డీ కేఎస్ వీరన్న మంగళవారం తెలిపారు. మార్కెట్‌కి వచ్చే వినియోగదారులు ఇటీవల కాలంలో చేతి సంచులు తెచ్చే అలవాటు మాయమై, బజార్లో దొరికే తక్కువ మైక్రాన్‌ఉండే తేలికైన పాలిథీన్ కవర్లకు అలవాటు పడ్డారు. గతంలో చేసినా ప్రచారాలు, ప్రయత్నాలు పెడ చెవిన పెట్టడంతో ఫలించలేదు. తాజాగా వ్యాపారులకు అపరాధ రుసుము రూ.5 వేలకు పెంచి, వ్యాపాపలువురికి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఫలితంగా పల్చటి కవర్లు బదులు ఎక్కువ మైక్రాన్లు ఉన్న కవర్లు వాడకంలోకి తెచ్చారు.



తాళ్లపూడిలో విక్రయిస్తున్న 120 కంటే ఎక్కువ మైక్రాన్ల కవర్లు

పార్టీ అనుబంధ విభాగాలు చురుగ్గా పని చేయాలి

తాళ్లపూడి(కొవ్వూరు): పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లడంతో పాటు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విధంగా అన్ని అనుబంధ విభాగాల అధ్యక్షులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కోఆర్డీనేటర్ తలారి వెంకట్రావు ఆదేశించారు. కొవ్వూరు పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల తరుపున పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం కుట్ర పూరితంగా ప్రతిపక్ష పార్టీ నాయకులపై కేసులు పెడుతుందన్నారు. పార్టీ నాయకులు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, అనుబంధ విభాగాల కార్యదర్శి సీహెచ్ ఓబేదు, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, కొవ్వూరు పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, తాళ్లపూడి మండల కన్వీనర్ నాగేశ్వరరావు, చాగల్లు అధ్యక్షుడు వెంకట్రావు, వివిధ విభాగాల నాయకులు కవల నాగేశ్వరావు, రాజకొండ సురేష్, మారిన రామకృష్ణ, దాకే రాజు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల సమావేశంలో పాల్గొన్న తలారి వెంకట్రావు

ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించాలి

ఉండ్రాజవరం: మండల పరిధిలో దుకాణాదారులు తమ షాపుల్లో ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో వి.రామారావు కోరారు. కాల్దారి గ్రామంలో మంగళవారం దుకాణాలను ఆయన ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ, పంచాయతీ కార్యదర్శి వి.శ్రీనివాసుతో కలిసి తనిఖీలు చేశారు. ఈ మేరకు ఆగస్ట్ 1వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని తప్పనిసరిగా నిషేధించాలని, ఏవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై జరిమానాలు విధిస్తామని దుకాణాదారులకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం చెత్తను సేకరించే పారిశుధ్య సిబ్బందికి దుకాణాదారులు, ఇళ్ల యజమానులు తడి, పొడి చెత్తను వేరువేరుగా అందజేయాలని సూచించారు.



కాల్దారిలో దుకాణాదారులకు నోటీసులు అందజేస్తున్న ఎంపీడీవో

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోండి

దేవరపల్లి: గృహాలకు స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.భగత్ ప్రజలకు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పెంచిన సర్దుబాటు విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక వారపు సంతలో కరపత్రాల పంపిణీ చేసి ప్రచారం చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదన్నారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై వేల కోట్ల రూపాయల భారాన్ని మోపిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు ప్రజలపై స్మార్ట్‌గా వాతలు పెడతాయని ప్రజలకు వివరించారు. మీటర్ల బిగింపు కోసం ఇళ్లకు వచ్చే వారిని అడ్డుకుని విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, కె.రత్నాజీ, మడెల్లి రామారావు, పిన్నమనేని సత్యనారాయణ, ఆచంట సుభాష్ చంద్రబోస్, పప్పు వెంకటరామారావు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

పెన్షన్ భిక్ష కాదు..ఉద్యోగుల హక్కు

నల్లజర్ల: కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా, కనీసం ఇంతవరకు ఒక్క కరవు భత్యం కూడ ప్రకటించలేదని వెంటనే వేతన సవరణ, తాత్కాలిక భృతి ప్రకటించాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలశాఖ అధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగులకు అందించే పెన్షన్ భిక్ష కాదని, అది వారి హక్కు అన్నారు. అనంతరం పెన్షన్ సాధన కోసం పోరాడిన డి.నకారా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఎస్.ప్రకాశరావు,జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు యస్.యం.ఆలీసాహెబ్, మండల ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరావు, కామేశ్వరావు, బాలయ్య, ప్రభుదాస్, నెక్కలపూడి ప్రతాప్, దత్తు, ఝాన్సీరాణి, అప్పారావు, మల్లిఖార్జునరావు, రాజేంద్రప్రసాద్, నరసయ్య పాల్గొన్నారు.

365 రోజులూ అందుబాటులో ఉంటాం

గోపాలపురం: రాష్ట్ర మానవత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి ఆశయాలకు అనుగుణంగా మండల మానవత సభ్యుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షుడు రాపాక ఫణికిషోర్ వెల్లడించారు. మంగళవారం స్థానిక శర్వాణి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తలసేమియా పిల్లలు, రోడ్డు ప్రమాద క్షతగాత్రులు, గర్భిణుల శస్త్ర చికిత్సలకు అవసరమైన రక్తాన్ని అందించడానికి బుధవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. రక్తం అవసరం ఉన్న వారికి 365 రోజులూ సంస్థ సభ్యులు అందుబాటులో ఉంటారని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రక్తనిధి డైరెక్టర్ జోడాల వెంకటేశ్వరరావు, మండల రక్తనిధి డైరెక్టర్ నెల్లి చంద్రశేఖర్, మండల సభ్యులు పాల్గొన్నారు.

మాజీ హోంమంత్రి పరామర్శలు

దేవరపల్లి: ద్వారకాతిరుమల మండలంలోని పలు గ్రామాల్లో మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను పరామర్శించారు. పంగిడిగూడెం సర్పంచ్ ప్రత్తిపాటి యోహాన్‌ను ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఏలూరు ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుమలంపాలెంకు చెందిన నాయకుడు ఆదూరి నాగరాజును ఆసుపత్రికి వెళ్లి యోగాక్షేమాల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిమ్మాపురం సర్పంచ్ యర్రగోళ్ల రజనీ భర్త మాధవ్‌ను పరామర్శించారు. పంగిడిగూడెంలో అనారోగ్యానికి గురైన పార్టీ నాయకుడు బోరుగడ్డ బుల్లిస్వామిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట పార్టీకి చెందిన పలువురు ముఖ్యనాయకులు ఉన్నారు.



పంగిడిగూడెం సర్పంచ్ యోహాన్‌ను పరామర్శిస్తున్న తానేటి వనిత, పార్టీ నేతలు

అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని ఆపాలి



దేవరపల్లిలో అంగన్‌వాడీ భవనం నిర్మించవద్దని ఆందోళన చేస్తున్న ఎంఆర్పీఎస్ నాయకులు

దేవరపల్లి: స్థానిక బాబూజగజ్జీవన్ రాం కమ్యూనిటీ భవనం ప్రాంగణంలో అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని చేపట్టవద్దని ఎంఆర్పీఎస్ నాయకులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. కమ్యూనిటీ భవనం ప్రాంగణంలో ప్రస్తుతం ఒక అంగన్‌వాడీ కేంద్రం ఉందని, రెండోవ భవనం నిర్మాణానికి సంబంధించి పంచాయతీ అధికారులు తీర్మానం చేసినట్లు వివరించారు. నూతన భవనం నిర్మాణం చేస్తే కమ్యూనిటీ భవనానికి అడ్డుగా ఉంటుందన్నారు. స్థానిక ప్రజల అవసరాలకు కమ్యూనిటీ భవనం ఉపయోగపడుతుందని, అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం నిలుపుదల చేయాలని కోరుతూ మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్. రవికిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సుమారు ఎనిమిదేళ్ల క్రితం అప్పటి గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మాణం చేసి ఇచ్చినట్టు ఆయన తెలిపారు. అప్పటి నుంచి భవన నిర్మాణం జరగకపోవడంతో అదే తీర్మానాన్ని తిరిగి ఇవ్వాలని ఐసీడీఎస్ అధికారి దరఖాస్తు చేయగా ఆ మేరకు ఇటీవల తీర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. కొత్తగా స్థలం కేటాయింపు జరగలేదని, ఎంఆర్పీఎస్ నాయకులు అభ్యర్థన మేరకు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని సీడీపీఓకు సూచించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తాం

గోపాలపురం: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని వెంకటాయపాలెం, వేళ్లచింతలగూడెం గ్రామాల్లో మంగళవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. అనంతరం వేళ్ల చింతలగూడెంలో ఇటీవల సుడిగాలికి దెబ్బతిన్న గృహాల బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

ఉండ్రాజవరం: మారుతున్న నూతన వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు అన్నారు. మండలంలో కాల్దారి, సత్యవాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, నానో యూరియా, డీఏపీల వినియోగాన్ని పెంచడంతో రసాయనక ఎరువుల వాడకాన్ని 10 నుంచి 25 శాతం వరకు తగ్గించవచ్చాన్నారు. ప్రస్తుతం వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా వస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. రైతులు మాట్లాడుతూ రాయితీపై టార్పాలిన్లు, స్ప్రేయర్లు సరాఫరా చేయాలని, ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు సమయంలో పంట ఉత్పత్తికి తగ్గట్టుగా టార్గెట్లు కేటాయించాలని ఏవోను కోరారు.



కాల్దారిలో వరిచేలను పరిశీలించి సూచనలు ఇస్తున్న రాజారావు

అవసరమైన మోతాదులో ఎరువులు వాడాలి

దేవరపల్లి: సార్వా వరి పంటకు అవసరమైన మోతాదులో ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్ రాజ్ రైతులకు సూచించారు. మండలంలోని కురుకూరు, త్యాజంపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించి, వరి చేలను పరిశీలించారు. మొక్కదశలో సరియైన మోతాదులో ఎరువులను వాడాలన్నారు. అధిక మోతాదులో ఎరువులను వేయడంతో అవి మట్టిలో గడ్డలుగా పేరుకుపోయి మొక్కకు అందవలసిన జింక్ వంటి పోషకాలు అందకుండా అడ్డుకుంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి సీహెచ్ సంజన, రైతులు భూపరరావు, కోదూరి వెంకటరత్నం, దావాల శ్రీనివాస్, వీఏఏలు పి. సురేష్, భాస్కర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

వధూవరులకు మాజీ మంత్రి ఆశీస్సులు

గోపాలపురం: మండల వైఎస్సార్ సీపీ నాయకుడు వంకా రాము కుమారుడు ప్రేమ్ కుమార్ వివాహనికి మాజీ రాష్ట్ర హోంమంత్రి ,నియోజకవర్గ కన్వీనర్ తానేటి వనిత మంగళవారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, వింత ప్రసాద్ రెడ్డి, గెల్లా వెంకటశ్రీను, తానేటి క్రాంతి కుమార్ నాయకులు పాల్గొన్నారు.



నూతన వధూవరులతో వనిత, నాయకులు

విద్యుత్‌కు అంతరాయం

గోపాలపురం: మండలంలోని జగన్నాధపురం 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు నిడదవోలు ఎగ్జికూటివ్ ఇంజనీర్ ఎన్. నారాయణ అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెం 11కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో హెడ్ క్వార్టర్స్ ఫీడర్‌లో ఆర్‌డీయస్‌యస్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 31, ఆగస్టు 1వ తేదిన ప్రకాశరావుపాలెం టౌన్ ఫీడర్, ఆవపాడు కాలనీలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు మంగళవారం తెలిపారు.